# శ్రీ రమణ జ్యోతి

ఆగష్టు 2019

ఈ సంచికలో ...

# Sri Ramana Jyothi

August 2019

IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.యస్. గారి 61వ ప్రవచనం | డా. వి. రామదాస్ మూర్తి | 3 |
| 2. | శ్రీ భగవాన్ సేవలో | జి. శ్రీహరి రావు | 11 |
| 3. | స్మృతులు | డా. టి.ఎన్. కృష్ణస్వామి | 19 |
| 4. | శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు | ఆర్. శ్రీరాములు | 22 |
| 5. | మాట మార్చిన మహర్షి | విడనపనకంటి | 26 |
| 6. | Sri Bhagavan As I Saw Him | Dr.K.Subrahmanian | 30 |
| 7. | Shifting Attention From 'Seen' to the 'Seer' 'Spiritual Sharing' | V. Ganesan | 36 |
| 8. | Sri Ramana Chatvarimsat-Verse 6 | V. Krithivasan | 39 |
| 7. | Lest We Forget- Sri R.J. Doshi | G. Sri Hari Rao | 43 |
| 9. | The Story of Ribhu and Nidagha | | 46 |
| 10. | Accepting Death | | 48 |
| 11. | Viranminda Nayanar | | 50 |


**Events in Sri Ramana Kendram in August/September**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 27th August - Punarvasu Satsang - 6.00 - 7.15 p.m.
4. 1st September - Bhagavan's Advent Day Celebrations and Satsang 9.00 a.m. - 12.00 noon

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyoti either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# మాట – ప్రభావం

డా॥ కే.యస్. గారి 61వ ప్రవచనం
అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

## మాటలో ఏముంది

ఒక్కొక్కసారి మనలో మనమే చర్చించుకుంటాం. అసలు ఎవరో గురువును గురించి ఎందుకు ఆలోచించాలి? నేను సమర్థుడినే. మరో గురువు ఎందుకు? నాకూ, గురువుకూ పెద్ద తేడా ఏమిటి? ఆయన మానవుడు, నేనూ మానవుడినే. అందుకే ఈ తేడాలనుకునేవి కృత్రిమాలే. ఆయన చెప్పేది నేనూ చెప్ప గలను, అంతే శక్తిమంతంగా. కాని రోజువారీ జీవితంలో కూడ మనం ఒక వాక్యాన్ని చెప్పి, దాన్ని ఇంకొక వ్యక్తిని, ఇతరులను చెప్పమంటే, అవి ఒకటిగానే వుండవు. ప్రభావంలో తేడాలుం టాయి. వాక్యమొకటే అయినప్పటికి, ఇతరులపై దాని ప్రభావం వేరుగా వుంటుంది. ఉదాహరణకు, భర్త ఒకటి అంటాడు. దాని ప్రభావం కుటుంబంపై కొంత వుంటుంది. భార్య ఒకటి అంటుంది, కుటుంబంపై దాని ప్రభావం ఒక రకంగా వుంటుంది. అదే పిల్లలు అంటే కుటుంబంపై మరొక ప్రభావం వుంటుంది.

మరి గురువు యొక్క ప్రభావం ఎలా వుంటుంది? గురువు గారు ఏళ్ళ కొద్ది తపస్సు చేసిన కారణంగా, వారి ఉపదేశంలో శక్తి వుంటుంది. వారు చెప్పేది సాధారణమనిపించ వచ్చు, కాని దాని ప్రభావం అసాధారణమై వుంటుంది. అసాధారణ మంటే ఏమిటని కొందరు ప్రశ్నించవచ్చు. అసాధారణత ఆ మాటల

వెనుక వున్న శక్తి, బలం. అంటే ఏమిటి? మీరు సంపద కలిగినవారూ, సమాజంలో ఎంతో శక్తిమంతులూ, అనుకుందాం. ఎవరినైన మీరు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళి దయచేసి ఆ వ్యక్తిని అరెస్ట్ చేయమని అక్కడి కానిస్టేబుల్‌కు చెప్పారనుకుందాం. 'దయచేసి' అరెస్ట్ చేయమన్నారు. కానిస్టేబుల్ ఎన్నో ప్రశ్నలు వేస్తాడు. ఆఖరుకు ఆ వ్యక్తిని అరెస్ట్ చేయొచ్చు, చేయక పోవచ్చు. ఆ సమయంలో అక్కడి సబ్ ఇన్‌స్పెక్టర్ వస్తాడు, ఆ వ్యక్తిని అరెస్ట్ చేయమని చెబుతాడు. అతను ఆ వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేస్తాడు. ఇక్కడ తేడా ఏమిటి? ఇద్దరూ మానవులే, అవే మాటలను వాడారు. కాని వాటి ప్రభావంలో తేడా వుంది. ఎందుకు? సబ్ ఇన్‌స్పెక్టర్‌కు కొన్ని అధికారాలున్నాయి. అందుకే వెంటనే ఆ వ్యక్తి అరెస్ట్ చేయబడ్డాడు.

మీరు ఇంకెవరైనా అయివుండవచ్చు. కాని ఆ అధికారం మీకు లేని కారణంగా ఆ వ్యక్తి అరెస్ట్ చేయబడలేదు. అదే మీకు ఆ ఇన్‌స్పెక్టర్‌తో పరిచయం వుండి, స్నేహితులైతే, ఆ విషయం కానిస్టేబుల్‌కు తెలిసివుంటే, అలాంటప్పుడు మీరు ఆ వ్యక్తిని అరెస్ట్ చేయమని చెప్పివుంటే, కానిస్టేబుల్ మీతో వాదించక కొద్దిసేపు ఆ వ్యక్తిని ఎటూపోకుండ ఆపి వుండేవాడు. అంటే అప్పుడు మీకు ఇన్‌స్పెక్టర్ నుండి కొంత అధికారం లభించిందన్న మాట. పై అధికారి కోపిస్తాడనే ఆలోచనతో అలా చేసేవాడు. గమనించాల్సింది ఏమంటే, మాటలు ఒకటే, ప్రభావం మాత్రం వేరు. అధికారం వున్న వాళ్ళతో దగ్గరగా వుంటే వాళ్ళకు కూడ కొంత వారి నుండి అధికారం వస్తుంది.



అలాగే ఒక ముఖ్యమంత్రి దగ్గర పనిచేసే బంట్రోతు కూడ మిమ్మల్ని, నన్ను ఏమిటి, ఒక మంత్రిని కూడ లోనికి పోనివ్వక పోవచ్చు. అతనితో మీరు వాదించలేరు. అతని అప్పటి అధికారం అది. మీరు ఏ బిర్లానో, టాటానో, అయినప్పటికీ, కారు నడుపుతున్నప్పుడు డ్యూటీ పోలీస్ వెయ్యి రూపాయల జీతగాడైనప్పటికీ ఆగమంటే మీరు ఆగాల్సిందే. అతనికి ఆ అధికారం ప్రభుత్వం నుండి వచ్చింది.

## గురువుగారి పలుకుల ప్రభావం

గురువుగారి విషయంలో కూడ అంతే. నిరంతరం దేవుని గురించి ధ్యానం చేసే అతను గురువు. ఇక జ్ఞాని దేవునితో సమానమే. అలాంటివారు ఏమైన చెబితే దానికి బ్రహ్మాండమైన శక్తి వుంటుంది. అది దేవునితో ఏర్పడిన అనుబంధం వల్ల కలిగింది. ఒక కానిస్టేబుల్‌కు, ఒక బంట్రోతుకే ఏదో కొన్ని సందర్భాల వల్ల అంత శక్తి వస్తే, మరి గురువుకు ఎంత శక్తి వుంటుంది? అందుకే పలికే మాటలు ముఖ్యమని అనుకోవద్దు. మీకు ఏదైన ఉపదేశం కావాలని అనుకుంటే తగిన గురువును ఆశ్రయించమని అంటారు. వారి పలుకులు ఎంతో శక్తి కలిగి వుంటాయి. ఆ కారణంగానే గురువును గురించి చెప్పేటప్పుడు "నా గురువు 'ఆశీర్వాదాన్ని' కోరుతున్నాను" అని అంటాము. గురువు చెప్పినది జరుగుతుంది. అంటే ఆయన మాట ప్రకారం ఎప్పుడూ అలాగే జరుగుతుందా? కాదు. అంతా బాగుంటుంది అంటే ఫలితం విజయవంతం కానీ, కాకపోనీ మీలో మాత్రం అశాంతి కలుగదు. మీరు మాత్రం అదే ప్రశాంతతను కలిగి వుంటారు. ఇదీ అతి ముఖ్యమైన విషయం.

ఎవరూ అన్ని సమయాల్లో జయాన్నే పొందలేరు, ఎవరూ ఎల్లప్పుడూ అపజయాన్నే అనుభవించరు.

పాండవులు ఎంతో మంచి ప్రవర్తన గలవారు. కాని వాళ్ళ జీవితాలు బాధామయమయ్యాయి. అయితే కౌరవుల్లో లేని శాంతిని అనుభవించారు. గురువు అందించే సందేశాలవల్ల మరెక్కడా దొరకని శాంతి లభిస్తుంది. గురువు మాటలు మాత్రం ఎంతో శక్తిని కలిగివుంటాయి. కారణం వారి అపరిమితమైన తపోబలం, దేవుని గురించిన ఏకధ్యానం.

## లౌకిక ప్రపంచంలో మాట ప్రభావం

నిత్యజీవితంలో కూడ మనలో కొందరు చక్కగా మాట్లాడతారు. దాని ప్రభావం కనిపిస్తోంటుంది. 'లక్ష్మీర్వసతి జిహ్వాగ్రే, జిహ్వాగ్రే మిత్ర బాంధవాః, వర్థనంచైవ జిహ్వాగ్రే మరణం తవమ్'. మీ సంపద, మీరు ధనాన్ని ఆర్జించుకునే శక్తి, మీరు ఎలా మాట్లాడుతున్నారన్న దానిపై ఆధారపడి వుంటుంది. మీరు ఏదైనా కొనడానికి వెళ్ళినప్పుడు, షాపులో వస్తువులను అమ్మజూపే వ్యక్తి చాలా నమ్రతగా వుండవచ్చు. ధరలు కొద్దిగా అధికంగా వున్నప్పటికీ, అదే షాపుకు వెళ్ళాలనిపిస్తుంది. ఎందుకంటే అక్కడ ఆదరణ లభించినట్లపిస్తుంది గనుక. కొందరు వ్యాపారులు తమ షాపులో పనిచేసేవారు కొనుగోనుదార్ల పట్ల చక్కగా వ్యవహరించి, కొనే వాళ్ళకు నచ్చే విధంగా ప్రవర్తించాలని కోరుకుంటారు. అలాంటి చోట్ల మరింతమంది కొనుగోలు చేయడానికి వస్తారు. పనివాళ్ళు దురుసుగానో, ఏమీ పట్టనట్లో వుంటే తక్కువ మంది షాపుకు వస్తారు, వ్యాపారం దెబ్బ తింటుంది. ఇది ప్రతి వ్యాపారికీ తెలిసినదే



అనుకోండి. ఓర్పుగా, నెమ్మదిగా వుండడం కష్టమైనది, కొన్ని ఏళ్ళ అనుభవం అవసరం అవుతుంది కూడ.

చాలా ఏళ్ళ క్రిందట (1950లలో) నేను లండన్‌లో ప్రఖ్యాత గొలుసు దుకాణాల సంస్థ 'మార్క్స్ అండ్ స్పెన్సర్' నుండి ఒక షర్టును కొన్నాను. 'డ్రిప్ అండ్ డ్రై' అనే ఆ రకం, ఉతికి, ఆరుగంటల పాటు ఆరేస్తే ఇస్త్రీ లేకుండ తొడుక్కోవచ్చు, పైగా కుంచించుకుని, చిన్నది కాదని కూడ ప్రకటించారు. కాని మూడు నెలల తరువాత అది చిన్నదైపోయింది. దాని గురించి కంపెనీకి వ్రాస్తూ, అలాంటి సంఘటనల వల్ల కంపెనీ పేరు, ప్రఖ్యాతులు దెబ్బతింటాయని తెలిపాను. షర్టు వాపసు చేస్తానని కూడ వ్రాయలేదు. నాలుగు రోజుల్లో మ్యానేజర్ షర్టును తీసుకురమ్మన్నారు. దాని నాణ్యత లోపమేనని అంగీకరిస్తూ, మరొక షర్టును తీసుకోమన్నారు. ఇక్కడైతే పరిస్థితి పూర్తిగా భిన్నంగా వుండవచ్చు. అందుకే లక్ష్మీర్వసతి జిహ్వాగ్రే, జిహ్వాగ్రే మిత్ర బాంధవాః అన్నారు. మీరు మంచిగా మాట్లాడే తీరును బట్టి మీరు స్నేహితులను దగ్గర చేసుకుంటారు. మాటలు మరీ మితిమీరితే జైలుకు పోవలసి రావచ్చు, కొన్ని సందర్భాలలో మరణం సంభవించవచ్చు కూడ.

## అంతర్గత ప్రశాంతత - పలుకుల ప్రభావం

గురువుగారు పలికే మాటలు ఎంతో ప్రభావవంతంగా వుంటాయి. వారిలో గొప్ప ప్రశాంతత చోటు చేసుకుని వుంటుంది. మీరు అనే పలుకులలో అలాంటి ప్రభావాన్ని కలిగించగలరని అనుకోకూడదు. గుర్తుంచుకోవలసింది ఏమంటే, మనం మాట్లాడే మాటలు మనం అనుభవిస్తున్న అంతర్గత ప్రశాంతతను బట్టి

వుంటాయి. మనసు శాంతంగా వుండడం అలవాటు చేసుకుంటే మన మాటలు కూడ కొంత శక్తిని కలిగి వుంటాయి. జ్ఞానులు అనునిత్యం ప్రశాంతులై లోపల నుండి మౌనం యొక్క ప్రభావాన్ని కలిగివున్నప్పుడు మాటలు కూడ శక్తిమంతమై వుంటాయి. మానసిక మౌనం ఎక్కువయ్యే కొద్దీ, మాటల శక్తి పెరుగుతుంది. మరొకటేమిటంటే ఆ శక్తి అసంకల్పితంగా జరిగేది. బాహ్యంగా మౌనాన్ని ప్రదర్శించినంత మాత్రాన మన మాటలు శక్తిని పుంజు కుంటాయని నమ్మడం నిజం కాదు. అలాంటివి మన గర్వానికి దారి తీస్తాయి, పొగరును అధికం చేస్తాయి.

మనకు తెలిసిన భాషల ద్వారా మన భావాలను తెలియ జెబుతాం. కాని ఎప్పుడూ మాట్లాడవలసిన అవసరం లేకపోవచ్చు. కొంతసేపు మాట్లాడకుండ కూడా భావవ్యక్తీకరణ చేయవచ్చు. మొత్తం 24 గంటలూ మాట్లాడనక్కరలేదు. అప్పుడు మౌనం ద్వారా సంభాషణ, వ్యక్తీకరణ జరుగుతాయి. అంటే మౌనం నుండి బయల్పడిన మాటలు మౌనంలోనికి చేరతాయి. ఆ మౌనం ఎక్కువ కాలం అయ్యేకొద్దీ మాట్లాడినవి ఎక్కువ శక్తిమంతమౌతూ వుంటాయి. భగవాన్‌లాంటి జ్ఞాని మౌనం ద్వారా సమాచారాన్ని తెలియజెప్పేవారు. మనం నమ్మక పోవచ్చు. కాని ఉదాహరణకు ఎవరినైన మొదటిసారి కలిసినప్పుడు ఎక్కడ నుండి వచ్చారు, ఏమి చేస్తుంటారు లాంటి ఎన్నో ప్రశ్నలు అడుగుతారు. తరువాతి సందర్భాలలో అన్ని ప్రశ్నల అవసరం వుండదు. పోనుపోను, స్నేహితులైన తరువాత మాట్లాడకుండ కూడ సమయాన్ని గడపవచ్చు. మరో మాటలో చెప్పాలంటే, అవతలి వ్యక్తిని పూర్తిగా అర్థం చేసుకున్నప్పుడు మాట అవసరం లేకుండ పోతుంది. భార్యా



భర్తలు ఎప్పుడూ మాట్లాడుతూనే వుండరు. ఒకే గదిలో వున్నప్పటికీ వారి మధ్య మాటల అవసరం లేకపోతుంది.

అందుకే, మనం గమనించి చూస్తే అవగాహన ఎక్కువయ్యే కొద్దీ, మాటల అవసరం తగ్గుతుంది. ఒకరినొకరు అర్థం చేసుకునే కొద్దీ, సంభాషణ అవసరం తగ్గుతుంది. అంటే, అవగాహన లేనప్పుడు సంభాషణ చేయాల్సి వస్తుంది. ఏ సూక్ష్మమైన సంజ్ఞ, అభినయం చాలు అర్థం చేసుకొనడానికి. మీరు చెప్పాల్సిన పని వుండదు. మౌనం ద్వారా అర్థం చేసుకోగల స్థాయిని చేరి వుంటాము. ఆఖరుకు చెప్పాలంటే, సంపూర్ణ అవగాహన నెలకొన్నప్పుడు, మాట్లాడవలసిన అవసరం వుండదు.

**మాధ్యమంగా భాష అనవసరం**

జ్ఞానులు ఆ స్థాయిలో వుంటారు. భాష అనే మాధ్యమం అవసరం లేకుండ ఇతరులతో విషయాలను పంచుకోగలరు. ఉదాహరణకు, నేను జ్ఞాని సమక్షంలో కూర్చున్నప్పుడు, లేదా ఒక గురువు యొక్క ఫోటో వైపు చూస్తున్నప్పుడు నాలో ఏదో జరుగుతుంది. ఇలాంటి 'మౌన సంభాషణ' తీవ్రమైనప్పుడు మాటతో పని లేకుండ నాకు శాంతిని 'ప్రసారం' చేయగలడు. నేను ఇతరులను మాటలతో ఓదార్చడానికి ప్రయత్నించినా, ఫలితం కనిపించకపోవచ్చు. కాని అవతలివారి పట్ల సానుభూతి, ప్రేమ, అవగాహన వుంటే నేను ఏమీ చెప్పవలసిన పని వుండదు. వారు మాత్రం ఓదార్పు పొందుతారు. ఎందుకంటే ఆ సానుభూతి ప్రభావంతో వారిలో ప్రశాంతత చోటు చేసుకుంటుంది. ఆ పరిస్థితుల్లో, నా గురించి అసలు ఆలోచించనప్పుడు నాలో అహం

లేకుండ పోతుంది. అలాగే గొప్ప ఏకాగ్రత కూడ ఏర్పడుతుంది. జ్ఞానుల విషయానికి వస్తే వాళ్ళలో రవంత కూడ అహం వుండదు. ఆ కారణంగా, వారు మనకు ప్రశాంతతను ప్రసాదించగలరు. వారు అసలు శాంతి స్వరూపులు. అందుకే వాళ్ళు ఇతరులతో మాటల ద్వారా తమ భావాలను తెలియజేసే ప్రయత్నం చేయరు.

శుద్ధ చైతన్య స్వరూపులైన వారి సమక్షంలో వున్నప్పుడు, వారి ప్రశాంత స్థితి మనకూ ప్రసారితమౌతుంది. మనం శరీరంపై పరిమళ ద్రవ్యాన్ని రాసుకున్నప్పుడు మనకు హాయిగా వుంటుంది. దాన్ని పరిసరాలకు వ్యాపింపజేయడానికి మనం ఏ ప్రయత్నమూ చేయనక్కరలేదు. అయినప్పటికి, ఇతరులు ఆ పరిమళ సుఖాన్ని అనుభవిస్తారు. సాధారణ స్థాయిలో పరిస్థితి ఇలా వుంటుంది. ఇక శుద్ధచైతన్యస్థితిలో వున్న గొప్పవారి సమక్షంలో వున్నప్పుడు మనం అవగాహనకు అందని శాంతిని అనుభవిస్తాము. అప్రయత్నంగా ఆ శాంతిని అనుభవించడానికి కారణం, ఆయనే శాంతి, ఆనందాల స్వరూపం, ఆయనే మౌనం. అలాంటి వారిని తలచుకున్నప్పుడు, దర్శించుకున్నప్పుడు, ఆయనను ధ్యానంలో నిలిపినప్పుడు, మనకు శాంతి లభిస్తుంది. కొంత సమయం తరువాత, ఆయన బాహ్యంగా లేరని, మీలోనే వున్నారన్న భావన కలుగుతుంది. ప్రాథమిక దశల్లో యిలా అనిపిస్తుంది కాని దైవానుగ్రహం వల్ల బాహ్యంలో వున్నది మన అంతరంలో వున్నదని, దేవుడు, ఆత్మ, గురువు, కృప అన్నవి వేరువేరు కావని తెలియవస్తుందని భగవాన్ చెబుతారు.

* * *



# శ్రీ భగవాన్ సేవలో

*(గత సంచిక తరువాయి)* - శ్రీ జి. శ్రీహరిరావు

1946 సెప్టెంబరు మొదటి తారీఖుకి, శ్రీ భగవాన్ తిరువణ్ణామలై వచ్చి యాభై సంవత్సరాలు అయింది. దీనిని పురస్కరించుకొని, చిన్నస్వామి ఒక స్వర్ణోత్సవాన్ని నిర్వహించారు. తగిన ఏర్పాట్లు చేయటానికి మద్రాస్, మధురలకు అనేకసార్లు తిరిగారు. పాతహాలును ఆనుకొని, అరుణాచల పర్వతానికి ఎదురుగా ఒక పెద్ద తాటాకు పందిరి కట్టారు. నేల గచ్చు వేయించారు. శ్రీ భగవాన్ దర్శనార్థం వచ్చిన భక్తులందరికీ సరిపోయేంత వైశాల్యంతో ఆ జూబిలీ హాలును తయారు చేసారు. ఆ హాలును మామిడి ఆకుల తోరణాలతో, పూలమాలలతో, ఎర్రరంగు బట్టలతో చక్కగా అలంకరించారు. అరుణాచలానికి ఎదురుగా ఒక రాతి సోఫాను వేసి దానిని కాంగ్రెస్ జెండాతో అలంకరించి శ్రీభగవాన్‌ను కూర్చుండబెట్టారు. ఆ ఉత్సవానికి పరాకాష్ఠలాగ, అరుణాచలేశ్వర ఆలయానికి చెందిన ఏనుగును చక్కగా అలంకరించి తీసుకువచ్చి శ్రీభగవాన్‌కు ప్రణామం చేసేలా ఏర్పాటు చేసారు చిన్నస్వామి. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని, ఒక స్వర్ణోత్సవ సంచికను కూడా ఆవిష్కరించారు. శ్రీభగవాన్ రంగుచిత్రాలు, భక్తులచే వ్రాయబడిన వ్యాసాలూ ఆ సంచికలో పొందుపరచబడినవి. శ్రీదేవరాజ మొదలియార్ వ్రాసిన 'అనుదినము శ్రీ భగవాన్‌తో' అనే పుస్తకంలోను, శ్రీమతి నాగమ్మ గారి 'శ్రీరమణాశ్రమ లేఖలు'లోను ఆ ఉత్సవ విశేషాలన్నీ

వివరింపబడినవి. స్వర్ణోత్సవ సంచికను రూపొందించిన ప్రొఫెసర్ స్వామినాథన్‌గారు చిన్నస్వామిగారి ఠీవిని, రాచరికపు లక్షణాలు పొడగట్టే ఆయన వ్యక్తిత్వాన్ని దృష్టిలో వుంచుకొని 'రోమన్ చక్రవర్తి' అని సంబోధించేవారు.

చిన్నస్వామి తన హయాంలో, ఆశ్రమంలో ఒక వేదపాఠశాల ఏర్పరిచారు. శ్రీభగవాన్ సమక్షంలో పాఠశాల విద్యార్థులు వేదం చదువుతుండడం భక్తులందరికీ సంతోషం కలిగించేది. ప్రతిరోజూ ఉత్తరాలు వచ్చినపుడు శ్రీభగవాన్‌కు చూపించి, ఎంతో జాగ్రత్తగా సమాధానాలు తయారుచేసి, పంపించే ముందు అనుమతి కోసం వాటిని శ్రీభగవాన్‌కు పంపించేవారు. ఆశ్రమాన్ని నిజంగా నడిపేది శ్రీభగవాన్ అనీ, తాను కేవలం ఆయన చేతిలో ఒక పనిముట్టు మాత్రమే అనీ చిన్నస్వామి గట్టిగా నమ్మేవారు. ఆశ్రమానికి వచ్చే ఉత్తరాలకు ఇచ్చే జవాబుల గురించి ఒక భక్తునికి వివరణ ఇస్తూ, "తాను కేవలం కాగితంమీద కలం పెడతాను అనీ, వ్రాయడం దానంతట అదే జరిగిపోతుందనీ, ఏమి వ్రాయబడిందో తాను తిరిగి చదివితేగానీ తనకు తెలియదనీ" చిన్నస్వామి చెప్పారు.

ఎన్నో ఆశ్రమాలు, మఠాలు, కొంతమంది వ్యక్తులు శ్రీరమణా శ్రమానికి తమ పుస్తకాలు పంపించేవారు. వాటన్నిటినీ వేరు పరచి, నంబర్లు వేసి, వాటికోసం ప్రత్యేకంగా కొన్ని గాజు బీరువా లలో భద్రపరిచేవారు. ఆశ్రమ గ్రంథాలయం ఈ విధంగా ప్రారంభింపబడింది. ఒక బాధ్యతాయుతమైన భక్తుడిని గ్రంథాలయ నిర్వహణకు చిన్నస్వామి నియమించారు. భక్తులకు



వేదాంతపరమైన సందేహాలు ఏవైనా వచ్చినపుడు, శ్రీభగవాన్ ఆ బీరువానుండి కావలసిన పుస్తకాన్ని తెప్పించి, అవసరమైన భాగాన్ని చదివి వినిపించి వారి సందేహ నివృత్తి చేసేవారు.

శ్రీరమణులు వ్రాసిన 'అరుణాచల స్తుతి పంచకం', అప్పడపు పాట, ఆదిశంకరుల 'వివేక చూడామణి' గద్యానువాదం మొదలైన పుస్తకాలను ఎచ్చమ్మాళ్, నారాయణరెడ్డి, అన్నాదురై మొదలైన భక్తులు ముద్రణ చేయించారు. వాటిని శ్రీఅరుణాచలేశ్వర దేవాలయ ఈశాన్య భాగంలో వున్న మండపంలో 'రమణీయ వాణి పుస్తకాలయం' పేరున అమ్మేవారు. చిన్నస్వామి ఆశ్రమ యాజమాన్యం చేపట్టిన తర్వాత ఆశ్రమం ఆఫీసు పక్కనే శ్రీరమణాశ్రమ పుస్తకాలయం మొదలుపెట్టారు. అనేక భాషలలో వెలువడే ఆశ్రమ ప్రచురణలు ఇక్కడ భక్తులకు లభ్యమయ్యేవి. చిన్నస్వామి తన దగ్గర మూడు తమిళ గ్రంథాలు భద్రంగా పెట్టు కొని అపుడపుడు చదువుకొనేవారు. అవి: 'రమణ విజయం', 'నూల్ తిరట్టు' (శ్రీరమణుల రచనా సంకలనం) మరియు 'నేనెవరు?' భక్తులందరికీ ఈ మూడు పుస్తకాలను చదవమని సలహా ఇచ్చేవారు. శ్రీభగవాన్ వ్రాసిన పద్యాలు, పాటలు, వాటి బోధనలను అర్థ తాత్పర్య సహితంగా వారికి కంఠస్థంగా వచ్చేవి. చిన్నస్వామి నిత్యం వాటిని పాడుతూ వుండేవారు. ఒక చిన్న పుస్తకంలో శ్రీభగవాన్ పాటలన్నీ వ్రాయించుకొని, దానిని తన నిత్యపారాయణకు వాడుకొనేవారు. ఆ పుస్తకంలోనే, తన తండ్రి గారి పుణ్యతిథిలాంటి ఇతర విశేషాలను కూడా వ్రాసిపెట్టుకొనే

వారు. ఇప్పటికీ, ఆ పుస్తకం ఆశ్రమంలో పురాతన పుస్తకాలతో పాటు భద్రపరచబడి వుంది. ఆయన కర్మయోగానికి ప్రతీక. శ్రీభగవాన్ సామాన్యులు కారు అనీ, అగ్నివంటివారు అనీ, కేవలం పరమశివుడు అనీ వారి దగ్గరికి వెళ్ళేవారందరూ ఇది గుర్తు పెట్టుకోవాలనీ చిన్నస్వామి ఆశ్రమానికి వచ్చే భక్తులకు సలహా ఇచ్చేవారు. “మనందరం ఒక కుటుంబానికి చెందినవారం. మనందరి దేవుడూ ఒక్కడే!” అనేవారు చిన్నస్వామి. గురువు కోసం అన్వేషిస్తూ తిరిగే మనుష్యులను ఉద్దేశించి, “సూర్యుణ్ణి చూడటానికి ఒక దీపం కావాలా?” అనేవారు చిన్నస్వామి. ఆధ్యాత్మిక భాస్కరుడు అయిన శ్రీభగవాన్ నిజంగా వేయి సూర్యులను మించిన ప్రకాశవంతులు కాదా?

పది సంవత్సరాలపాటు ఎంతో జాగ్రత్తగా, ఎంతో కష్టపడి కట్టిన మాతృభూతేశ్వరాలయ నిర్మాణం 1948లో పూర్తి అయింది. శ్రీభగవాన్ దీవెనలతో శ్రీ చిన్నస్వామి, ఇతర సహచరుల కృషి ఫలించింది. దేవాలయ కుంభాభిషేకమునకు కావలసిన వస్తువులు తీసుకువచ్చుటకు చిన్నస్వామి శ్రీభగవాన్ అనుమతితో మద్రాస్ వెళ్ళారు. శ్రీజయదేవ్‌లాల్ దవేగారి ఇంట్లో 22 రోజులు వున్నారు. ఉత్సవానికి రమ్మని, అనేకమందిని ఆయన స్వయంగా ఆహ్వానించారు. ఆశ్రమానికి చిన్నస్వామి గావించిన సేవకు ఇది కలికితురాయిగా నిలిచింది. ఆ పవిత్ర కార్యాన్ని సఫలీకృతం చేయటానికి ఎంతో మనోనిబ్బరమూ, ధైర్యమూ కావలసి వచ్చింది. ఎన్నో కష్టాలు పడాల్సి వచ్చింది. ఎన్నో విమర్శలు



ఎదుర్కోవలసిన పరిస్థితులు వచ్చాయి. ఎన్నో అడ్డంకులు అధిగమించా ల్సిన అవసరం వచ్చింది. కుంభాభిషేక మహోత్సవం జరపటానికి కావలసిన ఏర్పాట్లు కోసం ఎన్నో నెలలపాటు కృషి చేయవలసి వచ్చింది. కుంభాభిషేకోత్సవం అంతా వేదధర్మమునకు అనుగుణం గా జరపటానికి కావలసిన జాగ్రత్తల గురించి చిన్నస్వామి ఎంతో మంది విజ్ఞులనూ, శ్రేయోభిలాషులనూ సంప్రదించారు.

కుంభాభిషేకోత్సవం 1949 మార్చి 13న మొదలుపెట్టబడి 17న ముగిసింది. కొన్ని వందలమంది పండితులు పాల్గొనగా, నాలుగు రోజులపాటు వేదపఠన, హోమములూ జరుపబడ్డాయి. క్రతువులన్నీ మార్చి 17కు ముగిసాయి. పూరీ మఠానికి చెందిన శంకరాచార్య స్వామిజీ, అంతకుముందు వచ్చినపుడు ఇచ్చిన మాట ప్రకారం శ్రీభారతీకృష్ణ తీర్థులవారు ఉత్సవ కార్యక్రమాలన్నీ సవ్యంగా నిర్వహించడానికి విచ్చేసారు. పదివేలమందికి భోజనాలు పెట్టారు. ఈ ఉత్సవ వైభవాన్ని చూసి అంతా ఆశ్చర్య పోయారు. ఈ సేవను అంతా శ్రీభగవాన్ స్వయంగా పర్యవేక్షించారు. ఎంతోమంది వంటవారు, ఇతర సహాయకులూ కార్యక్రమంలో ఎటువంటి అవాంతరమూ జరగకూడదని రక్షక భట సహాయమూ, అగ్నిమాపకదళ సహాయమూ కూడా తీసుకున్నారు.

మొదటి రోజున శ్రీభగవాన్ పూర్ణకుంభంతోపాటు కొత్త హాలుకు నడిచివచ్చి, తిన్నగా అమ్మ గుడికి వెళ్ళిపోయారు. ఆలయంలో ప్రతిష్ఠించిన పవిత్ర వస్తువులను అన్నిటినీ తన చేతితో తాకి,

కొత్త హాలులో తనకోసం ఏర్పాటు చేసిన రాతి సోఫాలో ఆసీనులయ్యారు.

కుంభాభిషేకాన్ని అత్యద్భుతంగా, ఎంతో సమర్థవంతంగా నిర్వహించిన చిన్నస్వామిని పూలమాల వేసి గౌరవించారు. శ్రీభగవాన్‌కు గొప్ప సన్నిహిత భక్తులూ నెల్లూరు వాస్తవ్యులూ అయిన సాంబశివరావుగారు చిన్నస్వామికి పాదపూజ చేద్దామను కున్నారు. అందుకు శ్రీభగవాన్ అనుమతి తీసుకున్నారు. శ్రీభగవాన్ రాతి సోఫామీద కూర్చున్న తర్వాత, చిన్నస్వామిని సముచిత స్థానంలో ఆసీనులను గావించారు. చిన్నస్వామి వణికిపోసాగారు. "మీరు నన్ను మోసం చేయగలం అనుకుంటున్నారు. నేను ఎటువంటి పరిస్థితులలోనూ పాదపూజకు అంగీకరించలేను. దానికి దేహాత్మభావం పూర్తిగా పోగొట్టుకున్నవారే అర్హులు. నేను అర్హుడను కాను" అని చెప్పి లేచి వెళ్ళిపోసాగారు. అందరూ ఆయనను బలవంతపెట్టి కూర్చోపెట్టడానికి ప్రయత్నించారు. చివరకు ఆయన, "(ఒక భక్తుడు ఇచ్చిన) వెండితో పూసిన శ్రీభగవాన్ పాదుకలు, లింగం దగ్గర వున్నవి. వాటిని తీసుకువచ్చి వాటికి పూజ చేయండి" అని ఆదేశించారు. ఆ ప్రకారం పాదుకలకు పూజ చేయడం జరిగింది. శ్రీభగవాన్ చేతులమీదుగా చిన్నస్వామి కాషాయ వస్త్రాన్ని మహాప్రసాదంగా స్వీకరించి కళ్ళకు అద్దుకున్నారు. అపుడు ఆయన ఎంతో గంభీరమైన స్వరంతో, బహువినయంతో ఇలా అన్నారు: "శ్రీభగవాన్ సన్నిధిలో పూజలు గాని, ప్రణామములుగాని, భక్తిభావంగాని కేవలం శ్రీభగవాన్‌కే



అర్పణ చేయాలి. భక్తుల ఒత్తిడి వలన ఈ ఒక్కసారి నేను అంగీ కరిస్తున్నాను. ఇంకెపుడూ ఒప్పుకోను". చివరకు, ఉత్సవాన్ని విజయవంతం చేసిన అందరికీ చిన్నస్వామి బహుమతులు అందజేసారు.

శ్రీభగవాన్‌కు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా చూడటానికి చిన్నస్వామి చాలా జాగ్రత్త తీసుకొనేవారు. పాత రోజుల్లో, శ్రీభగవాన్ భోజనశాల నుండి బయటకు రాగానే, వారి అనుగ్రహం పొందాలని ఆయన విస్తట్లో భోజనం చేయడానికి భక్తులు వేచి వుండేవారు. ఈ విషయం తెలిసి, తన మోకాళ్ళ నొప్పుల వలన ఎంతో కష్టమైనా సరే, బయట పారవేయడం కోసం చేతిలో తన విస్తరి తీసుకొని భగవాన్ లేవసాగారు. ఎవరూ విస్తళ్ళు తీయనక్క ర్లేదనీ, ఇతర విస్తళ్ళతోపాటు శ్రీభగవాన్ విస్తరి కూడా తీయబడు తుందనీ, ఇతరులు ఎవరూ తన విస్తరిలో భోజనం చేయరనీ చిన్నస్వామి శ్రీభగవాన్‌ను ఒప్పించారు. అప్పటినుండి భోజనా నంతరం వదలి వేసిన అన్ని విస్తళ్ళనూ కలిపి తీసిపారవేయడానికి ఏర్పాటు చేయబడింది.

ఆశ్రమ యాజమాన్యాన్ని ఎంతమంది విమర్శలు చేసినా, వాటన్నిటినీ సంతోషంగా భరించిన చిన్నస్వామిని 'బట్టలు ఉతికే రాయి' అని సోమసుందరం పిళ్ళైగారి భార్య ఉమ అన్నారు. ఆశ్రమానికి సేవ చేయటమే చిన్నస్వామి జీవితాదర్శం. ఆయన అందరినీ ఎంతో గౌరవంతోనూ, దయతోనూ చూసేవారు.

*(సశేషం)*

# పాఠక మహాశయులకు వినతి

హైదరాబాదులోని శ్రీరమణకేంద్రం దాదాపు గత 40 సం॥గా 'శ్రీరమణజ్యోతి' పత్రికను ప్రచురిస్తోంది. శ్రీ భగవాన్ కృపతో ఇప్పటివరకు ఒక సంచిక కూడ తప్పకుండ ప్రతినెల పాఠక భక్తులకు పత్రిక అందింపబడుతోంది.

శ్రీరమణకేంద్రం, అలాగే శ్రీరమణజ్యోతి పత్రిక యొక్క వ్యవస్థాపకులైన డా.కె. సుబ్రహ్మణియన్ (డా.కె.ఎస్.) గారి మార్గ దర్శకాలను అనుసరించి, ఈ పత్రిక వీలైనంతవరకు, భగవాన్ రమణమహర్షి, వారి భక్తులు, మహర్షి తరచు సంప్రదించే గ్రంథాలు, వారిపై రచించబడిన పుస్తకాలలోని విషయాలను ప్రచురిస్తోంది. శ్రీరమణకేంద్రం యొక్క చిరకాల భక్తుల్లో తనువు చాలించిన సభ్యుల జీవిత విశేషాలు, కేంద్రానికి వారు అందించిన అపురూప సేవలను గురించిన అంశాలను ఇటీవల ధారా వాహికంగా వ్యాసాల రూపంలో ప్రచురించడం జరుగుతోంది. పాఠక భక్తులకు, ముఖ్యంగా యువతరం వారికి ఈ విశేషాలు ఆసక్తికరంగాను, స్ఫూర్తిదాయకం గాను వుంటున్నాయని ఆశిస్తున్నాము.

శ్రీరమణజ్యోతి గురించి, ముఖ్యంగా అందులో ప్రచురించ బడుతున్న విషయాల గురించి, పాఠక మహాశయులు తమ అభిప్రాయాలను మాకు (కేంద్రం ఆఫీసుకు) తెలియపరచవల సిందిగా కోరుతున్నాము. పాఠకుల అభిరుచుల మేరకు వివిధ అంశాలను అందిస్తూ, పత్రిక నాణ్యతను అనుగుణంగా రూపొందించడంలో ఈ సమాచారం ఎంతో ఉపయోగ పడుతుంది. ఆ దిశలో చర్యలు తీసుకొనడానికి తప్పక ప్రయత్నిస్తాము. సహకరించగలరు.

\- సంపాదకుడు



# స్మృతులు

డా. టి.ఎన్. కృష్ణస్వామి

(ఆశ్రమ 'అధికారిక' ఛాయాగ్రహకుడిగా ప్రసిద్ధికెక్కిన డా. కృష్ణస్వామిగారు తమ అనుభవాలను యిందులో వ్యక్తపరిచారు. భక్తులపై వున్న కరుణవల్లనూ, వారికి దారిచూపు నిమిత్తమూ, దైవము మానవరూపము దాల్చి భక్తులకు దర్శనమిచ్చెదరని శ్రీభగవాన్ ధృవీకరించారు. అందువలన శ్రీ భగవాన్ ఛాయా చిత్రముల ప్రాముఖ్యత గురించి వేరుగా వివరించనక్కరలేదు)

మదరాసులో నాకున్న పనుల వత్తిడి వల్ల ఎప్పుడు తిరువణ్ణా మల వెళ్ళిననూ, ఒకపూటగానీ లేక ఒక రోజుగానీ వుండుట మాత్రమే సాధ్యమయ్యేది. ఎప్పుడు వెళ్ళినా, నా కెమేరా నాతో తీసుకువెళ్ళి, నేనక్కడ వున్నంత సేపూ శ్రీ భగవాన్ ఫోటోలు తీయడంలోనే నా సమయం వెచ్చించేవాడిని. ఇదే పనిగా పెట్టు కున్నందుకు శ్రీభగవాన్ చిరాకుపడతారేమో అని భయపడేవాడిని. కానీ శ్రీభగవాన్ యెప్పుడూ విసుక్కోలేదు. వారు నడిచేటప్పుడూ, కూర్చున్నప్పుడూ, భోజనం చేసేటప్పుడూ, కాళ్ళు తుడుచుకొనే టప్పుడూ యెన్నో ఫోటోలు తీశాను. శ్రీ భగవాన్ చిరునవ్వుతో వున్నప్పుడూ, నవ్వుతున్నప్పుడూ, మాట్లాడుతున్నప్పుడూ, మౌనంగా వున్నప్పుడూ, చివరకు సమాధిలో వున్నప్పుడు కూడా వారిని నా కెమేరాలో బంధించాను. ఒకసారి వారు కొండమీదకు వెడుతుండగా వర్షము ఆరంభమయింది. పక్కనున్నవారు తాటాకులతో, యింటిలో చేసిన గొడుగును శ్రీభగవాన్‌కిచ్చారు. శ్రీభగవాన్ అది వాడుతున్నప్పుడు ఫోటో తీశాను. ఇంకోసారి,

మామూలు గొడుగు వాడుతూ హాయిగా నవ్వుతున్నప్పుడు యింకొక ఫోటో తీశాను.

'నేనీ దేహాన్ని కాదు', అని శ్రీ భగవాన్ బోధన అయినప్పుడు, యీ ఛాయాచిత్రాలకు యింత ప్రాధాన్యత యివ్వడం హాస్యాస్పదం కదా అని నాకు కొన్నిసార్లు అనిపించేది. నేను నీడను వెంటాడుతూ దానినే శాశ్వతం చేయాలని ప్రయత్నిస్తున్నాను కదా అని. ఆ రోజులలో శ్రీభగవాన్ బోధనలను నేనంతగా పట్టించుకొనే వాడిని కాదు. వారి భౌతిక రూపమూ, ఆ సొగసూ నన్నాకర్షించేవి. ఆయన ఫోటోలు తీయడం లోనే నాకు పరమానందం కలిగేది. నాకు శ్రీ భగవాన్ బోధన కంటే శ్రీభగవానే ముఖ్యముగా వుండేవారు.

ఆ తరువాత శ్రీభగవాన్ దేహం చాలించిన పిదప, నేను నా దృష్టి వారి బోధనలపై మరల్చాను. అప్పుడు నాకర్థమయింది. వారి సన్నిధి మహిమ నన్ను వారి బోధనలనుగ్రహించడానికి అర్హుడిని చేసినది. బిడ్డ తల్లిపట్ల ఎట్లా ఆకర్షింపబడుతుందో నేను శ్రీభగవాన్ పట్ల అలా ఆకర్షింపబడ్డాను. తనకు తెలియకుండానే, బిడ్డ తల్లివల్ల పోషింపబడినట్లు నేను శ్రీభగవాన్ వల్ల పోషింపబడ్డాను. శ్రీభగవాన్ దేహధారులై వున్నప్పుడు, వారి సన్నిధిలో నేనుండగల అదృష్టము నాకు పూర్తిగా అవగతమయినది. భగవంతుడు సాకార రూపము దాల్చినప్పుడు భక్తులు భక్తి పారవశ్యముతో పూజించుటను శ్రీ భగవాన్ యెట్లు ఆమోదించిరో యీ చిన్ని సంఘటన తెలియపరుస్తుంది.

ఒకరోజు నేను శ్రీభగవాన్‌తో అరుణాచల పర్వతముపై



నడుస్తున్నప్పుడు, మహర్షి, వంగి, ఒక చిన్న శిలను చేతిలో తీసుకొని నాతో అన్నారు: విదేశీయులొకరు, అరుణాచల పర్వతములో పరమ పవిత్రమైన ప్రాంతము నుండి ఒక శిల కావలెనని రాశారు. ఈ పర్వతమంతయు పవిత్రమని వారికి తెలియదు. ఈ పర్వతము సాక్షాత్తూ శివుడే! మనము యీ దేహముతో యెలా మమేకమవుతామో, పరమేశ్వరుడు, యీ పర్వతంతో మమేకమయినాడు. అరుణాచలం సాక్షాత్తూ పర్వత రూపంలో వున్న సర్వజ్ఞత. తనను దర్శించుకోవలెనని ఆర్తి ప్రదర్శించు భక్తులపై గల కరుణతో పరమేశ్వరుడు మన భౌతికమైన నయనములకు కన్పడు నిమిత్తము యీ పర్వత రూపము దాల్చినారు. సాధకుడు యీ పర్వత ప్రాంతములో నివసించినట్లయిన, మార్గము గోచరమవుతుంది. శాంతి లభిస్తుంది''. *(శ్రీరమణాశ్రమ ప్రచురణ 'Surpassing Love and Grace' నుండి గ్రహించిన వ్యాసమునకు స్వేచ్ఛానువాదము)*

*(అనువాదకర్త: జి. శ్రీహరి రావు*

## అందరూ గురువులే

**లోకంలో చెడ్డవారు, మంచివారు - అందరూ మనకు గురువులే. చెడ్డవారు తమ చెడ్డ పనుల ద్వారా 'నా చెంతకు రాబోకు'మని బోధిస్తూ వుంటారు. మంచి వారెప్పుడూ మంచివారే కదా. కనుక లోకంలో అందరూ మనకు గురువుల వంటివారే.**

# శ్రీ రమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# గుఱ్ఱం వేంకట సుబ్బరామయ్య (1899-1970)

శ్రీ రావినూతల శ్రీరాములు

## తొలిరోజులు

ప్రఖ్యాత విద్యావేత్త ప్రముఖ రమణ మహర్షి భక్తులు అయిన గుఱ్ఱం వేంకటసుబ్బరామయ్య గారు నెల్లూరు జల్లాలోని కృష్ణ పట్నంలో 1899 అక్టోబర్‌లో మహర్నవమి పర్వదినాన జన్మించారు. వీరి తల్లిదండ్రులు మంగమ్మ, వెంకట సుబ్బయ్య గార్లు. విద్యా వంతురాలయిన తల్లి ఇంగ్లీషు నేర్చుకొనడంలో తొలి గురువయ్యింది. ప్రాథమిక స్థాయి నుండి ప్రతిభావంతంగా విద్యాభ్యాసం గావించిన సుబ్బరామయ్యగారు మద్రాసు విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషు లిటరేచర్‌లో ఎం.ఏ. (ఆనర్స్) డిగ్రీని పొందారు. సంస్కృతం, తెలుగులో చక్కని పండితుడు.

1926 నుండి 1956 వరకు నెల్లూరు వి.ఆర్.కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్‌గాను, 1956 సం॥ నుండి 1965 వరకు నిడుబ్రోలు పి.బి.ఎన్. కళాశాల ప్రిన్సిపాల్‌గాను వీరు పనిచేశారు. షేక్స్‌పియర్ నాటకాలు బోధించడంలో సుబ్బరామయ్య గారు కడునేర్పరి. ఆయా పాత్రలు నటిస్తూ తరగతి గదిలో విద్యార్థులను ఆకట్టుకునేవారు.

## సాహితీ పటిమ

అనువాద రచనలో అందెవేసిన సుబ్బరామయ్యగారు కాళిదాసుని మేఘసందేశాన్ని సంస్కృతం నుండి అనువదించారు.



ఆంధ్ర మహాభారతాన్ని పూర్తిగా ఆంగ్లంలోనికి అనువదించారు. కాని విరాటోద్యోగ పర్వాలు మాత్రమే ప్రకటితమయ్యాయి. ఈ రచన తమ తల్లి ఆదేశం మేరకే చేశారు. మిగిలిన పర్వాలను ముందుగా అనువదించి, ఆరణ్య పర్వాన్ని చివరగా అనువదించారు. (ఈ కాలంలోనే వీరు కాలధర్మం చెందారు). చిత్రంగా, స్వర్గారోహణ పర్వం అనువదించగానే వారి మాతృమూర్తి స్వర్గాన్ని అలంకరించింది. కంచికామకోటి పీఠాధిపతులు పరమాచార్య శ్రీ చంద్రశేఖర సరస్వతీ స్వాముల వారికి వీరు ఆంగ్ల భారతాన్ని అంకితమొనర్చారు. వీరు ఆంగ్లంలో 'సాంగ్స్ అండ్ సానెట్స్, అను కవితను ప్రచురించారు.

సుబ్బరామయ్యగారు మంచి కవి, రచయితగానే కాక వక్తగా కూడ ప్రసిద్ధులు. నెల్లూరు శంకరమఠంలో, టౌన్ హాలులో వేదాంత, సాహిత్య సంబంధ ఉపన్యాసాలను అనేకం చేశారు. నెల్లూరు వర్ధమాన సమాజానికి కార్యదర్శిగా పనిచేసిన కాలంలో విశ్వకవి ఠాగోర్ జయంతిని వైభవంగా నిర్వహించారు.

## రమణమహర్షి సందర్శనం

1933 జూలైలో తొలిసారిగా భగవాన్ రమణమహర్షిని సుబ్బరామయ్య దర్శించారు. అప్పుడు వారు తమ చిన్నారి బిడ్డ గతించిన శోకంతో కంచి నుండి నెల్లూరు వెడుతూ అరుణాచలంలో భగవాన్‌ను దర్శించారు. ఆ తొలి కలయిక వారిపై గాఢ ప్రభావం కల్గించింది. భగవాన్ రచించిన ఉపదేశసారంలోని సాహితీ ప్రభావం ఆయనను మిక్కుటంగా ఆకర్షించింది.

నెల్లూరులోని ప్రముఖ న్యాయవాది, రమణభక్తుడు

గ్రిద్దలూరు సాంబశివరావుగారి నుండి పరిచయలేఖతో 1936 ఏప్రిల్‌లో భగవాన్‌ను తిరిగి దర్శించారు. భగవాన్‌లో సుబ్బ రామయ్య గారు తమ తండ్రిని చూసుకున్నారు. భగవాన్ రమణ మహర్షి అంకిత భక్తుల్లో సుబ్బరామయ్యగారు అగ్రగణ్యులు. తన కుమారుని కొకరిని 'రమణప్రసాదు' అని, కుమార్తె కొకరిని 'అలగమ్మ' (భగవాన్ తల్లి) అని పిలుచుకున్నారు. జీవితంలో అనేక కష్టాలను ఎదుర్కొన్న వీరికి భగవాన్ అండగా నిలిచారు. 1941లో సహధర్మచారిణిని, 1943లో ఇందిర అనే కుమార్తెను, సుబ్బరామయ్యగారు కోల్పోయారు.

## రమణ సాహిత్య ప్రచురణలు

భగవాన్‌కు సన్నిహితంగా మెలగిన సుబ్బరామయ్యగారు రమణ సాహిత్యాన్ని పరిపుష్టం చేశారు. భగవాన్ రమణ ఆదేశం మేరకు తమిళభాషను నేర్చారు. కావ్యకంఠులు సంస్కృతంలో రచించిన 'శ్రీరమణగీత', 'చత్వారింశత్', దైవరాతుడు రచించిన 'విభక్త్యష్టకం', సుబ్బరామయ్య గారు తెలుగు పద్యాలలో అనువదించారు. 'రెమినిసెన్స్ ఆఫ్ రమణ' అనే గ్రంథం 'రమణ స్మరణామృతం'గా ప్రకటితమైంది.

భగవద్గీతలోని ముఖ్య శ్లోకాలను ఏరి కూర్చవలసిందిగా సుబ్బ రామయ్యగారి ప్రార్థన మేరకు భగవాన్ 42 శ్లోకాలను 'భగవద్గీతా సారం' పేరిట కూర్చారు. దానికి సుబ్బరామయ్యగారు తెలుగులో సీసమాలిక సంతరించారు. స్వయంగా భగవద్గీత వ్యాఖ్య కూడ రాశారు.



తమిళంలోని 'వెణ్బా' ఛందస్సును భగవాన్ తెలుగులో ప్రవేశ పెట్టారు. దానిని స్ఫూర్తిగా చేసుకుని సుబ్బరామయ్య భగవాన్ వ్రాసిన అరుణాచల పంచరత్నాలను తెలుగులో వెణ్బా ఛందస్సులో అనువదించారు. ఆదిశంకరుల 'ఆత్మబోధ'ను కూడ సుబ్బరామయ్య వెణ్బా ఛందస్సులోనే తెలుగు చేశారు. భగవాన్ రచనల్లో ప్రశస్తమైన 'ఉపదేశసారం' సుబ్బరామయ్య తెలుగున ద్విపదగా వెలయించారు. ఆశ్రమం వారి కోరికపై భగవాన్ రచనలు 'నేనెవడను', 'ఉన్నది నలుబది', నారు నాగశౌర్య రమణ 'గీతానువాదం' సరిచూసి ప్రచురణకు తోడ్పడ్డారు. "వేదం వెంకట రాయ సంస్మృతి" అనే గ్రంథాన్ని భగవాన్ రమణులకు అంకిత మిచ్చారు.

## ఆశ్రమంలో సేవ

భగవాన్‌తోబాటు పాకశాలలో కొన్నిదినాలు సుబ్బరామయ్య సేవ చేశారు. అనేక సందర్భాలలో పద్యాలు వ్రాస్తూ వుండే సుబ్బ రామయ్య భగవాన్ ఉన్నట్లుండి తాంబూలం వేసుకొనడం మాని వేసినప్పుడు 'తాంబూల విలాపం' అనీ అలాగే పాకశాలకు వెళ్ళడం మానివేసినప్పుడు "పాకశాల విలాపం" అనీ పద్యాలు వ్రాశారు. గ్రిద్దలూరు సాంబశివరావు షష్టిపూర్తికి త్రిరత్నాలు వ్రాశారు.

1949లో అరుణాచలంలో మాతృభూతేశ్వర ఆలయం కుంభాభిషేకానికి, గ్రిద్దలూరు సాంబశివరావుతో కలిసి నెల్లూరు జిల్లాలో 20 పుట్ల ధాన్యం సేకరించి ఆశ్రమానికి అందజేశారు. సుబ్బరామయ్య అలాగే భగవాన్ శరీరం చాలించినప్పుడు 1950

ఏప్రిల్ 24న జరిగిన మహాభిషేకానికి తిరిగి కొన్ని పుట్ల ధాన్యం సేకరించి అందజేశారు.

1950 ఏప్రిల్ 4న (భగవాన్ ఇంకా పది దినాలకు శరీరం చాలించనున్నారనగా) భగవాన్ తనను దర్శించిన సుబ్బరామయ్యతో నీకేం కావలెనని ప్రశ్నించారు. నాకు అభయం కావలెనని సుబ్బరామయ్య కోరగా "సరే, ఇచ్చాను" అని భగవాన్ తెలిపారు. ఇలాంటి అపూర్వ ఆశీస్సులనందుకున్న రమణ మహర్షి అంకిత భక్తుడైన గుఱ్ఱం సుబ్బరామయ్య గారు 1970 మే నెలలో వైశాఖశుద్ధ ఏకాదశినాడు కాలధర్మం చెందారు.

## మాట మార్చిన మహర్షి

శ్రీ టి.కె. సుందరేశ అయ్యర్ దంపతులు భగవాన్ యొక్క గొప్ప భక్తులు. ప్రతిరోజు ఆశ్రమానికి వస్తున్నప్పుడు సుందరేశ అయ్యర్‌గారి భార్య ఏదో ఒక చిరుతిండిని భగవాన్ కోసం భర్తతో పంపించేది. అలాంటి పద్ధతులను భగవాన్ ఒప్పుకోరని తెలిసిన ఆమె భర్త దానిని అలవాటుగా చేసుకోవద్దని భార్యకు నచ్చజెప్ప ప్రయత్నించాడు. కాని ఆమెకు మాత్రం నమ్మకం కుదరక తన ధోరణిని మానుకోలేదు. ఒకరోజు భర్తతోబాటు తాను కూడ ఆహారాన్ని తీసుకొని ఆశ్రమానికి వచ్చింది. వంటకాన్ని వడ్డిస్తున్నప్పుడు భగవాన్ ఆమెవైపు తీవ్రంగా చూస్తూ, "నీవు వండిన తిండిని తినడం ఇదే ఆఖరుసారి. ఇకమీదట నాకోసం పంపవద్దు. అలా చేసినప్పటికీ, నేను మాత్రం దానిని తినను"



అని తెగేసి చెప్పారు. ఆమె ఎంతో బాధపడింది, వెళ్ళి మౌనంగా హాలులో భగవాన్ ఎదురుగా కూచుంది.

ఆమె దీనస్థితిని గమనించిన భగవాన్ హృదయం దయతో కరిగింది. ఆమెను ఏమీ నేరుగా అనలేదు. కాని ఎంతో విచిత్రంగా భగవాన్ ఆ రోజు ఒక కొత్త వంటకం గురించి చాలా విశదంగా, విన్నవాళ్ళెవరైన చేయగలిగే విధంగా వర్ణించి చెప్పారు. దానిని విన్న ఆమె దానిని వండి భగవాన్‌కు పెట్టాలన్న గాఢమైన కోరికను అణచుకోలేక పోయింది. మరుసటిరోజు ఎంతో శ్రద్ధాభక్తులతో వండినంత సేపు భగవాన్ గురించే ఆలోచిస్తూ, ఆయన చెప్పిన విధంగా వండింది. ఆశ్రమానికి తీసుకొచ్చి భగవాన్‌కు వడ్డించేలాగ చూసింది.

అంతకుముందు రోజు భగవాన్ మాటలను విన్న భక్తులు ఆమె తెగువ, మొండితనానికి విస్తుపోయారు. ఆమె మాత్రం భోజనశాలలో ఒక మూల నిలబడి, తాను ప్రేమతో తెచ్చిన పదార్థాన్ని తినమని మౌనంగా వేడుకొంటోంది. ఆమెను భగవాన్ కోపపడలేదు. ఆమెవైపు ఎంతో దయతో చూస్తూ, ఆ పదార్థాన్ని ఇష్టంగా తిన్నారు. హాలులోని భక్తులు భగవాన్ తమ శపథాన్ని తామే పాటించకపోవడాన్ని ఆశ్చర్యంగా గమనించారు. కాని నిశితంగా ఆలోచించి చూస్తే భగవాన్ "ఆమె" ఆహారాన్ని మాత్రమే తిననన్నారు. కాని ఆ రోజు ఆమె తనకు ఆర్తితో, తినాలనే సంకల్పంతో, తయారు చేస్తున్నప్పటి నుండి, విస్తరిలో వడ్డించే వరకు అదే ఆదుర్దా, ఆర్ద్రత చూపించింది. కళ్ళలో నీళ్లు నింపు

కొని దీనంగా ప్రార్థిస్తున్నట్లు ఆమె చూస్తుండడంతో ఆ భక్తికి అన్నీ పక్కకు పెట్టి తమ మాటను పట్టించుకోకుండా తిన్నారు.

ఈ సందర్భంలో మహాభారతంలోని ఒక ఉదంతం గుర్తుకు వస్తుంది. కురుక్షేత్ర యుద్ధం మొదలైన నాలుగవ రోజున కౌరవ సైన్యం వైపు నష్టాలు చాలా జరిగాయి. దుర్యోధనుడు మండి పడుతున్నాడు. ఆ కోపావేశంలో అతడు భీష్మాచార్యులు వున్న చోటికి వెళ్ళి ఆ వృద్ధవీరుడిని నానా మాటలు అన్నారు. దుర్యోధనుని పరుషవాక్యాలకు నొచ్చుకున్న భీష్ముడు "రేపు నేను ఎంత భయంకరంగా యుద్ధభూమిలో వుంటానో చూడు. కృష్ణుడు తనవైపు సేనల్ని కాపాడుకునేందుకు ఆయుధం పట్టాల్సి వస్తుంది" అని రోషంతో అన్నాడు. దానితో తృప్తుడైన దుర్యోధనుడు తిరిగి వెళ్ళాడు. కాని భీష్ముడు మానసికంగా ఎంతో కలత చెందాడు. "ప్రభూ, నేను ఉద్వేగంతో మాట ఇచ్చాను. నా మాటను నిలబెట్టు కొనేందుకు నీవే తోడ్పడాలి. నీవే రక్షించగలవు" అని మనస్సులో శ్రీకృష్ణుని వేడుకొన్నాడు.

ప్రక్కరోజు ఉదయం, యుద్ధం మొదలయ్యేసరికి, భీష్ముడు పాండవసైన్యంలో అర్జునుడు తప్ప ఎవ్వరూ ఎదుర్కొనలేనంత భీభత్సంగా పోరాడటం మొదలుపెట్టాడు. శ్రీకృష్ణుడు అర్జునునికి భీష్ముని బాణాలు దరిదాపున రాకుండ రథాన్ని ఎంతో చాకచక్యంగా నడుపుతున్నాడు. భీష్మాచార్యుడు బెంబేలెత్తి పోయాడు.



శ్రీకృష్ణుడు భీష్మునిపై దయచూప దలచాడు. రథాన్ని నెమ్మదిగా నడపసాగితే, ఆచార్యుని బాణాలు అర్జునునిని తాకేటంత దగ్గరగా రాసాగాయి. అప్పుడు బయటికి కోపాన్ని ప్రదర్శిస్తున్న కృష్ణుడు రథం నుండి క్రిందకు దూకి, అక్కడ పడివున్న ఒక రథచక్రాన్ని రెండుచేతులతో ఎత్తిపట్టుకుని, భీష్మునిపై విసరబోతున్నట్లు ముందుకు ఉరికాడు. యుద్ధభూమి మొత్తం నిశ్శబ్దమైంది. తాను యుద్ధంలో ఆయుధం పట్టనన్న ప్రతిజ్ఞ అందరికీ తెలుసు. అలాంటి ప్రభువు తన మాటను తప్పాడు. భీష్ముడు ఉప్పొంగి పోయాడు. విలమ్ములను ప్రక్కన పడేసి రెండు చేతులెత్తి మనసులో శ్రీకృష్ణుని మెచ్చుకొంటూ, "భగవంతా! నీ కృప గొప్పది. నేను కోపావేశంలో చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టేందుకు నీవు బహిరంగంగా ఇచ్చిన మాటను కాదన్నావా! నీకు వందనాలు" అన్నాడు. ఆ క్షణంలో భీష్మునికి తన ప్రార్థన ఫలించిందన్న విషయం తప్ప మరేదీ మనసులో లేదు.

అలాగే, భగవాన్ తాము ఇచ్చిన మాటను ప్రక్కన బెట్టి, తనను అనుగ్రహించారన్న కృతజ్ఞతాభావం శ్రీమతి సుందరేశయ్యర్‌ను ముంచెత్తింది. భక్తుల పట్ల గురుకృప అలా వుంటుంది.

- విడపనకంటి

ఆధారం: శ్రీరమణజ్యోతి, జూన్, 2016: "హి బ్రేక్స్ హిజ్ ఓన్ వౌ".

## Sri Bhagavan As I Saw Him

Dr.K.Subrahmanian (Talk 66)

The *ashram* which you see today is very different from the *ashram* that existed during the lifetime of Bhagavan. There was only one guest house next to the *ashram* store which was available to the visitors. You were given a mat to sleep on, and sometimes, you had to share it with two or three others. You had to use a wooden plank as pillow. Generally, nobody was allowed to stay for more than three days in the guest house. But all the visitors could eat in the *ashram.* The austerity of the *ashram* was extraordinary. Women were not allowed to stay in the ashram in the night. Many of them stayed with friends in the town. Now when you go to the *ashram*, you have a cottage and you have a bed that is comfortable.

You got up as early as you could, finished your ablutions, and went into the hall and sat there in the presence of Bhagavan. Much of the time Bhagavan was quiet. He would look at you, or he would look straight before him, and you got the impression that he was looking into infinity. Every day, newspapers used to be brought and he used to go through it. I used to think, "Why does Bhagavan read the newspaper? What is the need for him to find out what is going on in the world? Does he not know everything?" Years later, I got the answer. Bhagavan did not want us to feel that he was different from all of us. He did everything that we all do in our daily lives.

He used to sit with his legs stretched out most of the time, with a slight shaking of the head. But sometimes, he would



sit like a statue. On those occasions, you would think that if Shiva appeared on earth, he would be like this. After he finished reading the newspaper, he would fold it, and carefully put it in the wrapper in which it came, and send it to the office. It was a moving sight; nothing was unimportant for Bhagavan. Whatever he did was so beautiful and perfect. He used to go for a small stroll before meals, maybe for fifteen minutes. He would walk very slowly, most of the time looking at the ground. Summer or winter, Bhagavan walked without any footwear. Tiruvannamalai is very hot in the summer and you and I cannot walk without *chappals*. Bhagavan used to urge others to go quickly and not follow him. Kunjuswami used to say, "We were ashamed of ourselves. Bhagavan would walk slowly as if it were a moonlit night, and we were rushing for shelter because it was so hot."

